# డిగ్రీలో డిఫెన్స్, సైన్స్ సెక్యూరిటీ కోర్సు

## 2025-26 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉన్నత విద్యలో సంస్కరణలను అమలు చేస్తున్న నేపథ్యంలో వచ్చే ఏడాది 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీలో కొత్త కోర్సులను ప్రవేశ పెట్టనుంది. అందులో భాగంగా ఇప్పటికే డిగ్రీ సిలబస్ మార్పులకు ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోంది. అయితే వచ్చే ఏడాది నుంచి డిగ్రీలో డిఫెన్స్ సైన్స్ సెక్యూరిటీ కోర్సును ప్రారంభించాలని నిర్ణయించినట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఉన్నత విద్యా మండలి రూపొందించిన 2025 డైరీని, క్యాలెండర్‌ను ఆయన సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ మహమూద్‌తోపాటు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్వర్లుతోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. వచ్చే ఏడాది నుంచి డిగ్రీలో డిఫెన్స్ సైన్స్ సెక్యూరిటీ కోర్సును ప్రారంభించడంతోపాటు.. జేఎన్టీయూలో ఇంజనీరింగ్ విభాగం కోర్సుల్లోనూ మార్పులు చేసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కోర్సుల్లో మార్పుల కోసం అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)తోపాటు ఐఐటీ మద్రాస్ సహకారం అందించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన విషయాలను నేడు(మంగళవారం), రేపు (బుధవారం) హెచ్ఐసీసీలోని ఒక ప్రైవేటు హోటల్‌లోలో కీలక సమావేశాన్ని నిర్వ హించ నున్నారు. సమావేశంలో వివిధ ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సి పాల్స్‌తోపాటు.. ప్రొఫె సర్లు పాల్గొను న్నారు. వారు తమ అభిప్రాయాలను తెలియజేయనున్న నేప థ్యంలో వాటిని పరిగణనలోకి తీసుకొని నూతన కోర్సులను, సిలబస్‌ను ఇంజినీరింగ్‌లో అమలు చేయడానికి ఉన్నత విద్యామండలి ప్రయత్నిస్తోంది.

# రైతు భరోసాకు ప్రారంభమైన సర్వే

## మండలానికి ఒక గ్రామంలో పంట నమోదు

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రాష్ట్ర సర్కార్ కసరత్తును ముమ్మరం చేసింది. ఈ నెల 26వ తేదీ నుండి సాగులో ఉన్న భూములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. దీనిలో భాగంగా అర్హుల నిర్ధారణకు శాటిలైట్ సర్వేను ప్రామాణికంగా తీసుకోవాలని తొలుత భావించింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో మండలానికో గ్రామం చొప్పున పంటల నమోదు ప్రక్రియ చేపట్టనుంది. వాటి వివరాలను యాప్‌లో నమోదు చేసి శాటిలైట్ సర్వేతో సరిపోల్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ లోగా రాష్ట్రంలోని ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం 44 గ్రామాల్లోని 42 వేల ఎకరాల్లో అధికారులు సర్వే చేయనున్నారు. ఈ సర్వే సోమవారం నుండి ప్రారంభమైంది. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో విస్తరణ అధికారులు పంటల నమోదు ప్రక్రియను చేపట్టారు. ఖమ్మం జిల్లా లోని 41 గ్రామాల్లో 20,500 ఎకరాలు, కొత్తగూడెం జిల్లాలో 43 గ్రామాల్లో 21,500 ఎకరాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 20కి పైగా జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే నిర్వహించడం ప్రారంభమైంది.



వాస్కోడిగామా రైల్లో ఎస్‌టిఎఫ్ పోలీసులకు పట్టుకున్న మద్యం

# గోవా టు హైదరాబాద్ అక్రమంగా మద్యం తరలింపు

## 82 మద్యం బాటిళ్ల స్వాధీనం: ఎస్టీఎఫ్ టీం

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** గోవా నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు అక్రమంగా తలరిస్తున్న మద్యాన్ని ఎస్టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. వాస్కోడిగామా రైల్‌లో గోవా నుంచి తీసుకు వస్తున్నటువంటి 82 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టిఎఫ్ టీంల సీఐలు వెంకటేశ్వర్లు, నాగరాజుల నేతృత్వంలో 20 మంది సిబ్బంది కలిసి.. గోవా నుంచి వస్తున్నటువంటి వాస్కోడిగామా రైల్లోని ఏసీ బోగీల్లో తనిఖీలు చేపట్టారు. షాద్ నగర్‌లో రైలు ఎక్కినటువంటి పోలీసులు నాంపల్లి సికిందరాబాద్ వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 82 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.2 రెండు లక్షలు ఉంటుందని అంచనా వేశారు. మద్యం పట్టుకున్నటువంటి ఎస్టిఎఫ్ టీమ్‌లను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమలహాసన్‌రెడ్డితోపాటు అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీలు శ్రీనివాసరావు, తిరుపతియాదవ్ అభినందించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను విస్మరించింది

## బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను విస్మరించిందని బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిసి డిక్లరేషన్ పేరిట రాష్ట్రంలో అత్యధికంగా బిసిల ఓట్లు పొందిందన్నారు. సంవత్సరం పాలన గడిచినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసిల గురించి ఆలోచించచడం లేదన్నారు. హామీలు నెరవేర్చలేదన్నారు. బిసిలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ బిజెపి ఒబిసి మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా జనవరి 7న రాష్ట్రంలో అన్ని మండల కేంద్రాల్లో నిరసన వ్యక్తంచేసి, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం సమర్పించే కార్యక్రమాన్ని చేపడుతాం. గ్రామగ్రామన కాంగ్రెస్ నాయకులను నిలదీస్తామని, ఉద్యమ రీతిలో పోరాడుతామని అన్నారు.

# ఎంపికైన జూ.లెక్చరర్లకు నియామకపత్రాలు ఇవ్వాలి

## అపాయింట్‌మెంట్ ఆర్డర్స్‌ను అందజేయాలి

### ఇంటర్ కమిషనరేట్ ముందు అభ్యర్థుల ధర్నా

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఇంటర్ బోర్డు ముందు ఆందోళనకి దిగారు. జేఎల్ పోస్టులకి ఎంపికైన వందలాది మంది తమకు నియా మక పత్రాలను అందజేసి.. వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్‌ను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇంటర్ కమిషనరేట్ ముందు ధర్నా చేశారు. 2022లో 1392 జేఎల్‌న పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఆ తరువాత 2023లో పరీక్షలను నిర్వహించారు. 2024లో ఫలితాలను విడుదల చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కూడా పూర్తి చేశారు. మొత్తం 1392 పోస్టులకి 1139 పోస్టులకి అభ్యర్థులను ఎంపిక చేసిన టీజీపీఎస్సీ ఆ లిస్టును ఇంటర్ కమిషనర్‌కి పంపించింది. జేఎల్ పోస్టులకి ఎంపికైన అభ్యర్థులకి సోమవారం కౌన్సెలింగ్ ఉంటుందని ఇంటర్ కమిషనరేట్ నుంచి సమాచారమిచ్చారు. అయితే ఏమైందో తెలియదు. సోమవారం నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్టు శనివారం రాత్రి పొద్దుపోయాక తమకు సమ చారమిచ్చారని ధర్నాకు వచ్చిన నిరుద్యోగులు మీ డియాకి చెప్పారు. కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నామని చెప్పారు తప్ప.. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారో కూడా అందులో పేర్కొన లేదని ఎంపికైన అభ్యర్థులు విమర్శించారు. 17 యేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జేఎల్ నియామకాలు చేశారని.. ఆ తరువాత ఇప్పటి వరకు నియామకాలు చేపట్ట లేదన్నారు. ఇప్పుడు తాము జేఎల్స్‌గా ఎంపికైనప్పటికీ తమకు నియామకపత్రాలు ఇవ్వ కుండా.. కౌన్సెలింగ్ నిర్వహించి అపా యింట్‌మెంట్ ఆర్డ ర్స్ ఇవ్వడానికి ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఎంపికైన అభ్యర్థులు మండిపడుతున్నారు.

# ఇదేమీ కొత్తగా వచ్చిన వైరస్ కాదు.. భయపడొద్దు

## కేంద్ర ఆరోగ్యమంత్రి జెపి నడ్డా

**న్యూఢిల్లీ జనవరి 6:** దేశంలో మూడు హెచ్‌ఎంపివి కేసులు వెలుగులోకి రావడంతో కేంద్ర ఆరోగ్యశాఖఅప్రమత్తం అయింది. ఆరోగ్యశాఖ డైరెక్టర్ అతుల్‌గార్గ్ ఇతర సీనియర్ అదికారులతో మంత్రి జెపినడ్డా సమావేశం అయ్యారు. అనంతరం మాట్లాడుతూ ఈవైరస్ కొత్తేమీ కాదని ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తమశాఖతోపాటుఐసిఎంఆర్, ఎన్‌సిడిసిలు గమనిస్తున్నాయని అధ్యయనం చేస్తున్నాయన్నారు. హెచ్‌ఎంపివి కొత్తవైరస్ కాదని ఆరోగ్యరంగ నిపుణులు తెలిపారని, ఈవైరస్‌ను 2001లోనే గుర్తించారన్నారు. చాలా ఏళ్లుగా ఇది ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తిలో ఉందని మంత్రి అన్నారు. గాలి, శ్వాసప్రక్రియద్వారా వ్యాపిస్తుందని అన్ని వయసులవారిని ప్రభావితంచేస్తుందన్నారు. శీతాకాలం వసంతరుతువు ప్రారంభంలో ఈ వైరస్ ఎక్కువ ఉంటుందని చైనాలో ఈకేసులు ఎక్కువ ఉన్నాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఐసిఎంఆర్, ఎన్సీడీసీ చైనాతోపాటు పొరుగు దేశాల పరిస్థితిని గమనిసునతన్నాయని, ప్రపంచ ఆరోగ్యసంస్థ సైతం ఈపరిస్థితిని పరిగణనలోనికి తీసుకుని నివేదికను అందిస్తుందని మంత్రి నడ్డా భరోసా ఇచ్చారు. ఐసిఎంఆర్, సమీకృత వ్యాధి అధ్యయన వ్యవస్థలతో దేశంలోని శ్వాసకోశ వైరస్‌ల డేటాను సమీక్షిం చాయని, సాధారణ వ్యాధికారక వైరస్‌లలో ఏ విధమైన పెరుగుదల నమోదుకాలేదన్నారు. ఈ పరిస్థితిని సమీక్షించేందుకు ఆరోగ్యశాఖ డైరెక్టర్‌జ నరల్ అధ్యక్షతన జాయింట్‌మానిటరింగ్ సమావేశం జరిగిందని మంత్రి తెలిపారు. ఎలాంటిపరిస్థితిని అయినా అధిగమించే వనరులు ఉన్నాయని, ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్యమంత్రి జెపినడ్డా పేర్కొన్నారు.

**ఆరోగ్యమంత్రితో సమీక్షించా: కర్ణాటక సిఎం సిద్ధరామయ్య**

బెంగళూరులో ఇద్దరు చిన్నారుల్లో ఈవైరస్ సోకిందని తెలియగానే ఆరోగ్యమంత్రి దినేశ్ గూండూరావుతో సమీక్షించానని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తెలిపారు. మనదేశంలో నమోదయిన కేసులు స్థానికస్ట్రెయిన్‌కు సంబంధించినవేనని అన్నారు. భయం వద్దని సాధారణ జలుబు, ఫ్లూ దగ్గు వంటి లక్షణాలుంటాయని తెలిపారు. చైనాలో వ్యాప్తిలో ఉన్న వైరస్‌తో వీటికి సంబంధం ఉండకపోవచ్చన్నారు. కేసుల నిర్ధారణకు పిసిఆర్ పరీక్షలుచేయాల్సిన అవసరం ఉందన్నారు.

**సత్వర చర్యలు చేపట్టండి:కేజ్రీవాల్**

వైరస్ వ్యాప్తి ఉధృతం అయి పరిస్థితి చేయిదాటకుండా సత్వర చర్యలు తీసుకోవాలని ఢిల్లీమాజీ సీఎం అరవింద్‌కేజ్రీవాల్ కేంద్రానికి సూచించారు. కొవిడ్ సమయంలోనిఅనుభవాలను దృష్టిలో ఉంచుకుని సత్వరచర్యలు తీసుకోవాలని కోరారు. పరిస్థితి అదుపు తప్పకుండా మరింత పకడ్బందీ చర్యలుచేపట్టాలనిమరో ప్రజారోగ్య పరిస్థితి రాకుండా నివారించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయనగుర్తుచేసారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి జెపి నడ్డా

# మిగులు విద్యుత్‌లో దేశానికే తెలంగాణ ఆదర్శం

## 9న న్యూ ఎనర్జీ పాలసీ విడుదల: డి.సిఎం విక్రమార్క

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** మిగులు విద్యుత్‌తో దేశానికే తెలంగాణ ఆదర్శ రాష్ట్రం అవుతుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్ర మార్క తెలిపారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో విద్యుత్ రంగం ప్రధానపాత్ర పోషిస్తోందన్నారు. హైదరాబాద్ సచివాలయం వద్ద సోమవారం తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోలో కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన 315 మంది అసిస్టెంట్ ఇంజనీర్ల (ఎఇ)కు నియామక పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన తెలంగాణ న్యూఎనర్జీ పాలసీని ప్రకటిస్తామన్నారు. దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఈ పాలసీ ఉంటుందని చెప్పారు. గత పదేళ్లుగా రాష్ట్రంలో న్యూ ఎనర్జీ పాలసీని అప్పటి ప్రభుత్వం రూపొందించ లేదని విమర్శించారు. ఈ న్యూ పాలసీలో భాగంగా 2030 సంవత్సరం నాటికి 22448 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోందని వివరించారు. 20 వేల మెగావాట్ల గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళికులు తయారుచేసే పనిలో ఉన్నట్లు వెల్లడించారు. దేశంలో ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న అంశాలతో పాటు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న రెనువబుల్ ఎనర్జీ ఉత్పత్తి కావాల్సిన అన్ని అంశాలను అధ్యయనం చేసి న్యూ ఎనర్జీ పాలసీని తయారు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను కూడా అందుకు తగినట్లు విస్తరిస్తున్నామని వెల్లడించారు. ఒరిస్సా నైనీ కోల్ బ్లాక్ వద్ద థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కసరత్తు జరుగుతోందన్నారు. రామగుండంలో జెన్కో, సింగరేణి సంయుక్త ఆధ్వర్యంలో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ముందు వెళుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో నిముషం కూడా అంతరాయం లేకుండా సంవత్సర కాలంగా నాణ్యత కలిగిన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో చదువుతున్న ప్రతి బిడ్డకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఖచ్చితమైన ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. గత ప్రభుత్వ హయంలో కొలువుల కోసం విద్యార్థులు పోరాటం చేసి అలసిపోయారని, చివరకు వారి వయసు కూడా అయిపోయిందని వాపోయారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామన్నారు. యూపీఎస్సీ తరహాలో ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించామని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఎక్కడా అక్రమాలు జరగకుండా, పగడ్బందీగా పరీక్షలు నిర్వహించి, ఇంత వరకూ 56 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందచేశామని పేర్కొన్నారు.



**చెమట చుక్కలకు తర్ఫీదు లోగో ఆవిష్కరణ**

సింగరేణి రూపొందించిన చెమట చుక్కలు తర్ఫీద్ లోగోను విక్రమార్క ఆవిష్క రించారు. దేశ విదేశాల్లో ఉన్నత విద్య ఉపాధి అవకాశాలపై అవగాహన, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కోల్‌బెల్టు యువతను నిలిపే ప్రయత్నం సింగ రేణి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్కో సిఎండి కృష్ణభాస్కర్, సింగరేణి సింఎడి ఎన్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

# 16వ తేదీ వరకు అపరాధ రుసుంతో ఇంటర్ పరీక్ష ఫీజు గడువు

## రూ. 2,500 ఆలస్య రుసుంతో అనుమతించిన ఇంటర్ బోర్డు

### డిసెంబరు 31 వరకు ఫీజు కట్టినవారు 9,53,545 మంది

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు వార్షిక పరీక్షల ఫీజు చెల్లించడానికి గడువును పొడిగిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ నెల 2తో అపరాధ రుసుంతో ఇంటర్ పరీక్ష ఫీజు గడువు ముగిసిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలోని సుమారు లక్ష మంది వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించకపోవడంతో ఇంటర్ బోర్డు అపరాధ రుసుం రూ. 2500తో ఈ నెల 16 వరకు పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పిస్తున్నట్టు బోర్డు కార్యదర్శి సోమవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మిక్స్‌డ్ అక్యూపెన్సీలో కొనసాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలకు ఇప్పటి వరకు 2024-25 విద్యా సంవత్సరం గుర్తింపును ఇంటర్ బోర్డు ఇవ్వలేదు. ఆయా కాలేజీలకీ ఫైర్ ఎన్‌వోసీ లేకపోవడంతో ఇంటర్ బోర్డు గుర్తింపును ఇవ్వలేదు. దీంతో ఆయా కాలేజీల యాజమాన్యాలు మూడు రోజుల నక్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశాయి. ఇంటర్ బోర్డు కార్యదర్శిని కలిసి సమస్యను పరిష్కరించాలని సీఎం సూచించగా.. సోమవారం ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలు ఇంటర్ బోర్డు కార్యదర్శితో చర్చలు జరిపారు. కాలేజీ యాజమాన్యాలతో చర్చలు జరిపిన అనంతరం ఇంటర్ వార్షిక పరీక్షల ఫీజును రూ. 2500 అపరాధ రుసుంతో చెల్లించడానికి అవకాశం కల్పించారు. డిసెంబర్ 31 సాయంత్రం వరకు వరకు రాష్ట్రంలో 9,53,545 మంది ఇంటర్ పరీక్ష ఫీజును చెల్లించినట్టు అధికారులు తెలిపారు. మరో 1,06,815 ఫీజు చెల్లించలేదు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 4,24,402 మంది అడ్మిషన్లు పొందగా వారిలో 4,07,563 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. మరో 16,839 మంది ఫీజు చెల్లించలేదు. ఒకేషనల్ విద్యార్థులు 51,478 మంది అడ్మిషన్లు పొందగా వారిలో 44,177 మంది ఫీజు చెల్లిస్తే మరో 7301 మంది పరీక్ష ఫీజును చెల్లించలేదు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 5,26,098 మంది అడ్మిషన్లు ఉంటే వారిలో 4,56,657 మంది థియరీ పరీక్ష ఫీజు చెల్లింగా.. 138 మంది ప్రాక్టికల్ ఫీజును చెల్లించారని.. మరో 69,441 మంది ఎటువంటి పరీక్ష ఫీజును చెల్లించలేదు. అలాగే ఒకేషనల్‌కి సంబంధించి 58,382 మంది అడ్మిషన్లు తీసుకొని ఉండగా వారిలో 45,148 మంది థియరీ పరీక్షల ఫీజును చెల్లిస్తే.. మరో 153 మంది ప్రాక్టికల్ పరీక్షల ఫీజును చెల్లించారు. అడ్మిషన్ పొందిన వారిలో 13,234 మంది ఎటువంటి పరీక్ష ఫీజును చెల్లించ లేదు. డిసెంబర్ 31 నాటికి ఇంటర్ సెకండియర్‌లో 82,675 మంది.. మొదటి సంవత్సరంలో 24,140 మంది కలిపి.. 1,06,815 మంది వార్షిక పరీక్ష ఫీజును చెల్లించ లేదు. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలను నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించడానికి ఇంటర్ బోర్డు ఇప్పటికే షెడ్యూల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

# అమెరికాను వణికిస్తున్న 'పోలార్ వర్టెక్స్' భారీ మంచు తుఫాను!

**వాషింగ్టన్, జనవరి 6:** భారీ మంచు అమెరికాను వణికిస్తోంది. తాజాగా యుటాలోని కాటన్‌వుడ్ క్యానన్‌లో మంచు తుఫాను దూసుకొచ్చింది. పోలార్ వర్టెక్స్ కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో మీడియాలో వైరల్ అయింది. గంటకు అయిదు అంగుళాల తీవ్రతతో మంచు కురుస్తున్నట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. మంచు తీవ్రత కారణంగా రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. మొత్తం 12 నుంచి 22 అంగుళాల మేర మంచు పేరుకుపోయినట్లు కథనం తెలిపింది. మరికొన్ని ప్రాంతాల్లో 15 అంగుళాల వరకు మంచు కురిసినట్లు నేషనల్ వెదర్ సర్వీస్ తెలిపింది. దీని కారణంగా విజిబులిటీ కూడా పడిపోయినట్లు పేర్కొంది. కాగా అమెరికాలోని పలు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో మంచు, వర్షంతో పాటు అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయనని ఇటీవల వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ దశాబ్దంలోనే అతి తీవ్ర తుఫాను సంభవించే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దీని ప్రభావం 15 రాష్ట్రాలపైనా ఉండనుందని మంచు తుపాను వల్ల దాదాపు 30 మిలియన్ల మంది ప్రజలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నట్లు హెచ్చరిం చింది. పోలార్ వర్టెక్స్ వల్ల ప్రతికూల వాతా వరణం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గత దశాబ్దిలోనే అతి తీవ్రశీతల తుపానుగా మాం ˘నున్నట్లు అంచనావేసింది. వాతావరణశాఖ హెచ్చరికలతో పలు రాష్ట్రాలు అప్రమత్త మయ్యాయి. వర్జీనియా, కాన్సాస్, కెంటకీ, ఆర్కాన్సాస్‌లు ఇప్పటికే ఎమర్జెన్సీ విధించాయి. తాజాగా కాటన్‌వుడ్ కాన్యన్‌లో మంచు తుపాను విరుచుకుపడింది.



# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరును స్వాగతించాలి

## రైతు భరోసాను రూ. 12 వేలకు పెంచడం గొప్ప నిర్ణయం

### మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 6:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి ఎస్ జైపాల్ రెడ్డి పేరు పెట్టడం అభినందనీయమని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో కిలక భూమిక పోషించిన జైపాల్ రెడ్డి కృషిని ఎప్పటికి మరవలేమని ఆయన చెప్పారు. సుఖేందర్‌రెడ్డి సోమవారం శాసనమండలిలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. జైపాల్‌రెడ్డికి ప్రచారం తక్కువ పని ఎక్కువగా చేసే తత్వం ఉందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడాన్ని ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా స్వాగతించాలని ఆయన కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంధుప్రీతితో ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెడుతున్నారని దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రం సాధించడం కోసైం కేంద్ర మంత్రి హోదాలో ఆయన ఎనలేని కృషి చేశారని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడాన్ని తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారని సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక సమస్యలను,సవాళ్లను ఎదుర్కొంటుం దన్నారు. అయినప్పటికీ రైతులను ఆదుకోవాలనే దృఢ సంకల్పంతో ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసాను జనవరి 26 నుండి అమలు చేయడం అభినందనియమన్నారు.

రైతు భరోసాను రూ.10వేల నుండి రూ. 12 వేలకు పెంచడం గొప్ప నిర్ణయమని తెలిపారు. ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని ధైర్యంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని,క్యాబినెట్ మంత్రులను శుభాకాంక్షలు తెలిపారు. ఈ నిర్ణయం పట్ల తెలంగాణ రైతులందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. భూమిలేని రైతు కూలీలకు ఏటా రూ.12వేల సాయం అందించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. సన్నాలకు రూ. 500 బోనస్ ఇవ్వడం శుభపరిణామం అని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వ పనితీరు ప్రజాయోగ్యంగా ఉందని, ప్రతిపక్ష పార్టీలు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని ఆయన అన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులు ఎస్‌ఎల్‌బిసి, డిండి, ఉదయ సముద్రం ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు.

ప్రస్తుత ఎమ్మెల్యేలు నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రజల అభీష్టానికి అనుగుణంగా నడుచుకొవాలని ఆయన సూచించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎల్లవేళలా ఉంటుందని ఆయన తెలిపారు. విమర్శలు చేయడం, దుష్ప్రచారం చేయడమే పనిగా ప్రతిపక్ష పార్టీలు పెట్టుకోవద్దని,ప్రభుత్వానికి సరియైన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రజల కోసం పని చేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. ఇందిరమ్మ దరఖాస్తు కోరితే మా ఊర్లో 1050 ఇండ్లు ఉన్నాయని, ఇప్పుడు మళ్లీ 850 మంది ఇండ్లు కావాలని దరఖాసునత చేసుకున్నారన్నారు.

# ఖమ్మం జిల్లాలో రూ. 2 కోట్ల గంజాయి, డ్రగ్స్ ధ్వంసం

**క్రైమ్ ఖమ్మం, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వి బి కమలహాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ప్రభుత్వ ఆమోదిత నిషేధిత గంజాయి డ్రగ్స్‌ను ధ్వంసం చేశారు. జిల్లా వ్యాప్తంగా గత కొంతకాలంగా పట్టుబడి నిలవ ఉన్న సుమారు రెండు కోట్ల గంజాయిని కాల్చి బూడిద చేశారు. 831 కేజీల గాంధీతో పాటు 11 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్‌ను కూడా దహనం చేశారు. ఖమ్మం మధీర నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 91 కేసుల్లో వాటిని ఇప్పటివరకు నిల్వచేసి భద్ర పరిచారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పురస్కరించుకొని గోపాలపేట సమీపంలోని ఏడబ్ల్యూఏంప కనసల్టింగ్ లిమిటెడ్‌లోని గంజాయి డ్రగ్స్‌ను ధ్వంసం చేశారు. ఖమ్మం డిస్పోజల్ అధికారి డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి డ్రగ్స్‌ను కాల్చివేసిన అధికారుల్లో అసిస్టెంట్ కమిషనర్లు జి గణేష్ డిసిఈఓ నాగేందర్‌రెడ్డి వివిధస్టేషన్‌ల హౌస్‌ఆఫీసర్లు పాల్గొన్నారు. అధికారుల సిబ్బందిని రాష్ట్ర డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి అభినందించారు.

# సినిమా టిక్కెట్ల రేటు పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తా

## చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మన్ దిల్‌రాజు

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సినిమా టికెట్ల పెంపుదలపై మరోసారి సిఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు తెలిపారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 10న విడుదలవుతున్న గేమ్ ఛేంజర్ చిత్రానికి తెలంగాణలో కూడా టికెట్ ధరల పెంపు కోసం ప్రయత్నిస్తానని సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో అన్నారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. చిత్రపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చాలా ముందుచూపుతో ఉందన్నారు. టికెట్ రేటు పెంచడం వల్ల 18 శాతం పన్ను రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. భారీ బడ్జెట్‌తో నిర్మించిన సినిమాలకు ప్రభుత్వాల నుండి సహాయం ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయంలో గత ప్రభుత్వాలు అన్నీకూడా చిత్ర పరిశ్రమకు మద్దతునిచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్ర సిఎం కూడా సినీ ఇండస్ట్రీకి అండగా ఉంటానని ఇప్పటికే చెప్పారన్నారు. ఈ నేపథ్యంలోనే మళ్లీ సిఎంను కలుస్తానని వెల్లడించారు.

# ప్రైవేటు హాస్టల్ నిర్లక్ష్యానికి విద్యార్థి బలి

**చెన్నారావుపేట, జనవరి 6, ప్రభాతవార్త:** ప్రైవేటు హాస్టల్ నిర్లక్ష్యానికి ఓ విద్యార్థి బలైన సంఘటన మండలంలోని ముగ్ధంపురం గ్రామంలో సోమవారం నెల కొంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా తానూరు మండలం, ఈవి గ్రామానికి చెందిన దత్తారెడ్డి-లక్ష్మీదంపతుల కుమా రుడు అవినాష్ స్థానిక ముగ్ధంపురంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో బీఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడన్నారు. దూరం ప్రాంతమైనందున కళాశాలకు ఎదురుగానే ప్రధాన రహదారి చెంతనే ఉన్నటు వంటి ప్రైవేటు హాస్టల్లో ఉంటున్నాడన్నారు. అక్కడే ఉంటూ కళాశాలకు వెళ్లి వస్తుంటారన్నారు. కాగా ప్రైవేటు హాస్టల్‌లో నీటి సరఫరా కోసం ఉన్నటువంటి మోటర్ సరిగ్గా పనిచేయలేదన్నారు. ఇదే క్రమంలో హాస్టల్ నిర్వాహకుడు వెలుగు వివేక్ అక్కడే ఉండి మోటర్‌ను నడిపించే పనులు చేపట్టారన్నారు. యజమాని విద్యార్థులతో సైతం పలు పనులు చేయించే వాడన్నారు. ఈ క్రమంలో విద్యుత్ మోటర్ నడిపిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలిందన్నారు.



అవినాష్ (ఫైల్)

**హాస్టల్ యజమాని నిర్లక్ష్యం..ఆర్ఎంపితో చికిత్స**

కాగ విద్యుత్ షాక్ తగలగానే కూతవేటు దూరంలో ఉన్నటువంటి నర్సంపేటకు తీసుకువెళ్లాల్సి ఉండగా హాస్టల్ నిర్వాహకుడు ముగ్ధంపురం గ్రామంలోని ఓ ఆర్ఎంపి వద్దకు తీసుకెళ్లాడన్నారు. అక్కడే ఆరోగ్యం విషమించిందన్నారు. అనంతరం నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆరోగ్యం విషమించి మృతి చెందాడన్నారు. కాగా ప్రైవేటు హాస్టల్ యజమాని నిర్లక్ష్యం మూలంగానే విద్యార్థి బలైపోయాడని తోటి విద్యార్థులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు, కళాశాల యాజమాన్యం అక్కడికి చేరుకొని విద్యార్థి మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రైవేటు హాస్టళ్లు కనీసం నిబంధనలు పాటించడం లేదని వారు ఆరోపించారు. చెన్నారావుపేట ఎస్ఐ రాజేష్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని వివరాలు ఆరా తీశారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

## పరామర్శించిన ఎమ్మెల్యే.. ఆర్థిక సాయం అందజేత

**కల్వకుర్తి, జనవరి 6, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన సంఘటన పాఠకులకు విధితమే.. పోస్టుమార్టం నిమిత్తం యువకుల మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన గణేష్ (35), కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన రామకోటి (30) మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఆసుపత్రికి తరలించిన నేపథ్యంలో సోమవారం ఆస్పత్రి ఆవరణలో మృతుల బంధువులు, కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. మృతుల్లో ఒకరైన గణేష్‌కు భార్య శివలీల, ఇద్దరు కుమారులు ప్రణయ్, వేధాష్ ఉన్నారు. ఆస్పత్రిలో మృతదేహాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు అంత్యక్రియ నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ యువ నేత ఆశాదీప్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయకుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి తోపాటు పలువురు కౌన్సిలర్లు ఆయా గ్రామాల నాయకులు తదితరులు మృతులకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే




# కనీస పింఛను రూ.5 వేలుగా చేయాలి

## బడ్జెట్‌లో అందుకు ప్రతిపాదనలు అవసరం

### కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు ట్రేడ్ యూనియన్ల వినతి

**న్యూఢిల్లీ, జనవరి 6:** ఈపీఎఫ్ పింఛన్‌ను నెలకు కనీసం రూ.5 వేలకు పెంచాలని కేంద్రాన్ని ట్రేడ్‌యూనియన్లుకోరాయి. అలాగే 8వ వేతన కమిషన్ ఏర్పాటు చేయాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాయి. 2025-26 బడ్జెట్‌కు సంబంధించి సూపర్‌రిచ్‌పై పన్నులు వేయాలని ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.10 లక్షలుచేయాలని కేంద్రాన్ని ట్రేడ్ యూనియన్లు కోరాయి. గిగ్‌వర్కర్లకు సామాజికభనరదత కల్పించాలని విజ్ఞప్తిచేసాయి. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విదానాన్ని పునరుద్ధరించాలనికోరాయి. సమావేశం అనంతరం యూనియన్‌ప్రతినిదులు ఇదే విషయమై మీడియాతోమాట్లాడారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ నిలపాలని కేంద్రాన్ని కోరామన్నారు. టియూసిసి జాతీయ కార్యదర్శి ఎస్‌పి తివారి మాట్లాడుతూ బడ్జెట్‌లో సూపర్‌రిచ్‌పై రెండుశాతం అదనపు పన్నువేసి అసంఘటితరంగ కార్మికుల సంక్షేమానికి ఆమొత్తం వినియోగించాలనికోరారు. వ్యవసాయ కార్మికులకు సామాజికభద్రత కల్పించాలని వారికీ కనీస వేతనాలు అందించాలనికోరారు. కనీస పెన్షన్ రూ.1000 నుంచి ఐదువేలకు పెంచాలనిబిఎంఎస్ కార్యదర్శి పవన్‌కుమార్‌కోరారు. విడిఎకు అనుసంధానంచేయాలని కోరారు.

# నేర దర్యాప్తులో భారత్‌కు సహకరించేందుకు మస్క్ నిరాకరణ!



**న్యూఢిల్లీ, జనవరి 6:** ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ నేర దర్యాప్తులో భారత్‌కు సహకరించేందుకు తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీంతో వీటిని భారత్‌లో వాడితే అసాంఘిక శక్తుల చేతిలోకి వెళ్లే ప్రమాదముందన్న భయాలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఈ టెక్నాలజీ భారత టెలికామ్ నియంత్రణ సంస్థ ట్రాయ్ మార్గదర్శకాల కోసం ప్రభుత్వం ఎదురు చూస్తోంది. అండమాన్ నికోబార్ దీవుల్లో కొన్ని నెలల క్రితం మయన్మార్ స్మగ్లర్ల నుంచి పట్టుబడిన 6 వేల కిలోల మెథాంఫెటమిన్ దర్యాప్తులో స్టార్‌లింక్ సంబంధించిన అంశాలు వెలుగు చూశాయి. స్మగ్లర్లు సముద్రయానం చేసే సమయంలో మార్గం గుర్తించేందుకు వీలుగా ఈ సంస్థకు చెందిన ఇంటర్నెట్ పరికరాలను వినియోగించినట్లు గుర్తించారు. దీంతో స్మగ్లర్లు వాడిన పరికరాల డేటా ఇవ్వాల్సిందిగా భారత ప్రభుత్వం స్టార్‌లింక్‌ను కోరింది. కానీ, కస్టమర్ల వ్యక్తిగత సమాచార గోప్యతను సాకుగా చూపి ఆ సంస్థ నిరాకరించింది. మయన్మార్‌లో స్టార్‌లింక్ అందుబాటులో లేదు. అయితే ఇది ఇండోనేషియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్ వంటి సమీప దేశాలలో అందుబాటులో ఉంది. ఈ డిష్‌ను ఎవరు, ఎక్కడ కొనుగోలు చేశారో తెలుసుకోవడంతో పాటు దీని వినియోగ చరిత్రపై మేం మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది. దీంతో భారత్‌లో అక్రమ కార్యకలాపాలకు స్టార్‌లింక్ పరికరాలు వాడే అవకాశం ఉందని హోంశాఖ, టెలికమ్యూనికేషన్ విభాగాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు స్టార్‌లింక్‌ను భారత్‌లో అనుమతించాలంటే ఇక్కడ భద్రతకు సంబంధించి అవసరమైన కస్టమర్ డేటా మేనేజ్‌మెంట్‌కు ఇక్కడి నిబంధనలు అమలు చేయాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# బడ్జెట్లో రైతులకు 35 శాతం కేటాయించాం

## రూ.40 వేల కోట్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**షాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే రైతులకు రూ.40 వేల కోట్లను అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్ నగర్ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాల యాదయ్య మండలి పట్నం మహేందర్ రెడ్డి లతో కలిసి మంత్రి స్పీకర్ పాల్గొని మాట్లాడారు. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో కోహెడ వద్ద రూ.2వేల కోట్లతో మెగా మార్కెట్లో పూలు పండ్లు కూరగాయలతోపాటు రైతులు పండించిన ప్రతి పంట విక్రయించి లాభపడేలా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మొయినాబాద్ లో మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలంటూ ఎమ్మెల్యే కాలె యాదయ్య, భీమ్ భరత్ తన దృష్టికి తీసుకువచ్చారని, కొత్త మార్కెట్ యార్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో రైతుల కోసం ఏ రాష్ట్రంలో లేని విధంగా బడ్జెట్లో 35శాతం నిధులు కేటాయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీ చేయడానికి విడతల వారీగా చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల లోపు రుణాలు ఉన్న రైతులకు ఏకకాలంలో మాఫీ చేసిందన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా కోసం రూ.10వేల కోట్లు కేటాయిస్తున్నామన్నారు. ఖరీఫ్ నుంచి పంట బీమాకు రూ.3500 కోట్లు కేటాయించి రైతులకు పూర్తిస్థాయి నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతు బీమా కు రూ.3వేల కోట్లు ఇస్తున్నామని ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం గృహ జ్యోతి రూ.500 కే వంట గ్యాస్ అమలు చేసి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు నరసింహారెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# కాకినాడ సీపోర్ట్, సెజ్ వ్యవహారంలో ఇడి కేసు

## విచారణకు హాజరైన వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 6:** కాకినాడ సీ పోర్టు, సెజ్ వ్యవహారంలో విజయసాయిరెడ్డి సోమవారం హైదరాబాదులో ఈడీ విచారణకు హాజరయ్యారు. విచారణ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనను ఆరు గంటల పాటు ప్రశ్నించారని, 25 ప్రశ్నలు అడిగారని వెల్లడించారు. కేవీ రావు చేసిన ఆరోపణలపై ప్రశ్నించారని వివరించారు."ఓ ప్రజాప్రతినిధిగా నా వద్దకు ఎంతోమంది వస్తుంటారు. కొందరు అధికారులకు ఫోన్ చేసి పనులు అయ్యేలా చూడమని కోరుతుంటారు, మరికొందరు వ్యాపారవేత్తలకు ఫోన్ చేసి ఉద్యోగాలు ఇచ్చేలా చూడమని అడుగుతుంటారు. ఈ విధంగా ప్రతి రోజు నన్ను కోకొల్లలుగా కలుస్తుంటారు. ఈ క్రమంలో ఆయా వర్గాలకు నేను ఫోన్లు చేయడం సాధారణం. ఇక నా మీద ఉన్న ఆరోపణలు చూస్తే కాకినాడ సీ పోర్ట్ విషయంలో కేవీ రావుకు నేను ఎలాంటి ఫోను చేయలేదు, విక్రాంత్ రెడ్డిని పంపిస్తానని చెప్పలేదు. ఇదే విషయాన్ని విచారణలో స్పష్టంగా చెప్పాను. కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదులో ఏవైనా వాస్తవాలు ఉన్నట్టయితే అతడి పేరు కె.వెంకటేశ్వరరావు కాబట్టి అతడి పేరులో తిరుమల వెంకటేశ్వరస్వామి ఉన్నాడు, ఆ కేవీ రావు తిరుమలకు వస్తే, నేను కూడా తిరుమలకు వెళతాను తన ఫిర్యాదులో అ అంశాలు కరెక్టేనని ఆ దేవదేవుడైన వెంకటేశ్వరస్వామి సమక్షంలో చెప్పమనండి. ఆ ఫిర్యాదులోని అంశాలు వాస్తవమే అయితే దేవుడు నాకు శిక్ష విధిస్తాడు, నా ఆరోగ్యం దెబ్బతింటుంది. ఆ ఫిర్యాదులోని అంశాలు అవాస్తవాలే అయితే... కేవీ రావు అనే వ్యక్తిని దేవుడు శిక్షిస్తాడు. కేవీ రావు చెబుతున్నట్టుగా 2020 మే నెలలో నేను కేవీ రావుకు ఫోన్ చేసి ఉన్నట్టయితే కాల్ డేటా రికార్డ్స్ తెప్పించండి. అది వెరిఫై చేసి నేను ఫోన్ చేసినట్టు నిర్ధారిస్తే నేను తప్పు చేశానని ఒప్పుకుంటాను. నాకు తెలిసి కేవీ రావుకు నేను ఎప్పుడూ ఫోన్ చేయలేదు. ఈ విషయాన్ని నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను. కేవీ రావు చెబుతున్నదే నిజమైతే కేవీ రావును రమ్మనండి నేను అతడ్ని క్రాస్ ఎగ్జామిన్ చేస్తాను, అతడు నన్ను క్రాస్ ఎగ్జామిన్ చేస్తాడు అప్పుడు వాస్తవాలేంటనేది బయటపడతాయి అని ఈడీని కోరాను" అని విజయసాయిరెడ్డి వివరించారు. కాకినాడ సీ పోర్టు, సెజ్ వ్యవహారంలో అక్రమంగా షేర్లను బదలాయించుకున్నట్టు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీ రావు) అనే వ్యక్తి ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేయడం తెలిసిందే. సీఐడీ కేసు ఆధారంగా ఈడీ కూడా కేసు నమోదు చేసింది.

# ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్ యాక్ట్‌ను సమర్థంగా అమలుచేయాలి

## వైద్యమంత్రి దామోదర రాజనరసింహ

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో క్లినికల్ ఎస్టాబ్లిష్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాన్ కమ్యూనికేబుల్ డిసిజెస్(ఎన్‌సీడీ) క్లినిక్స్ లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేలా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్‌లు బాధ్యత తీసుకుని విజయవంతంగా నడిపించాలన్నారు. డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్ఎస్‌లు, జీజీహెచ్ సూపరింటెండెంట్స్ తో ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు. జిల్లా స్థాయిలో డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌లు ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేలా సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్‌లలో సరోగసి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. డీఎంహెచ్‌వోలు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రతి నెల 15 ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)లను పరిశీలించి రాష్ట్ర హెల్త్ డైరెక్టర్‌కు నివేదికను సమర్పించాలన్నారు.



**వర్క్‌షాపును ప్రారంభించిన మంత్రి**

ఫార్మసీ, ఈ-ఔషధి వర్క్ షాపును వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజల నిత్య జీవితంతో ముడిపడి ఉండే డిపార్ట్‌మెంట్ వైద్య, ఆరోగ్య శాఖ అని.. మెడిసిన్‌కు సంబంధించి అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ తెలిపారు. మీరు అడిగినట్టు హెచ్ఆర్, ఎక్విప్‌మెంట్ అన్నీ అందుబాటులోకి తీసుకొస్తున్నామని.. ప్రతి జిల్లాలోనూ సెంట్రల్ మెడిసినల్ స్టోర్స్ ఏర్పాటు చేశామన్నారు. మెడిసిన్ డిస్ట్రిబ్యూషన్‌కు వాహనాలు సమకూర్చామని.. అన్ని సీఎంఎస్‌లు, ఫార్మసీ స్టోర్లలో కంప్యూటర్లు, ఇంటర్నెట్ ఫెసిలిటీ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అన్ని మెడిసిన్ మేము ఇస్తున్నామని.. అయినప్పటికీ అక్కడక్కడా మందులు లేవని వార్తలు వస్తున్నాయన్న మంత్రి.. ఇందుకు కారణం ఏంటో హాస్పిటల్ సూపరింటెండెంట్లు, ఉన్నతాధికారులు గుర్తించాలన్నారు. ఎక్కడ నిర్లక్ష్యం జరుగుతుందో, అక్కడ సంబంధిత అధికారి, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటుందన్నారు. ఇకపై ఎక్కడైనా పేషెంట్ ఇబ్బంది పడినట్టు తమ దృష్టికి వస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

# చిప్‌ల తయారీ పరిశ్రమకు హైదరాబాద్ అనుకూలం

## ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** సెమీ కండక్టర్ (చిప్‌ల తయారీ), దాని అనుబంధ పరిశ్రమలకు అనుకూల వాతావరణం (ఎకోసిస్టమ్) హైదరాబాద్‌లో ఉందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సోమవారం తనతో భేటీ అయిన పిటిడబ్ల్యు గ్రూప్ ఏషియా విభాగం ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. సెమీకండక్టర్ పరిశ్రమకు అవసరమైన విడిభాగాలు, పునర్నిర్మాణం, ఆటోమేషన్, పరికరాలను సరఫరా చేసే ఈ సంస్థకు ప్రాంతీయ కార్యాలయం సింగపూర్‌లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసే పక్షంలో ప్రభుత్వం విధానాల ప్రకారం రాయితీలు, ప్రోత్సాహకాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి వారికి వివరించారు. ఇక్కడ నైపుణ్యం ఉన్న మానవ వనరులకు కొదవ లేదని శ్రీధర్ బాబు తెలిపారు. సరైన ప్రతిపాదనలతో వస్తే తమ ఆహ్వానం ఎప్పటికీ ఉంటుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. సెమీకండక్టర్ క్లస్టర్ ఏర్పాటు విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తమ ప్రతిపాదనలో ఉన్నట్టు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో ఉత్పాదక కేంద్రం మొదటి దశ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నట్టు పిటిడబ్ల్యు ఏషియా విభాగం ఎండి టార్ స్టెన్ సెయ్ ఫ్రైడ్ పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ స్థానిక భాగస్వామి బార్ ట్రానిక్స్ ఎండి విద్యాసాగర్ రెడ్డి, సింగపూర్ కు చెందిన కన్సల్టెంట్ సంస్థ టాప్2 పిటిఇ సిఇఓ రావు పనిదపు తదితరులు పాల్గొన్నారు

**బిజెపి ఎమ్మెల్యే వ్యాఖ్యలు సంస్కారహీనం**

**ప్రియాంక గాంధీపై వ్యాఖ్యలకు మంత్రి ఖండన**

బిజెపికి మహిళలంటే కనీస గౌరవం లేదని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓ ప్రకటనలో విమర్శించారు. ఢిల్లీలోని కల్కాజీలో రోడ్ల గురించి చెబుతూ ప్రియాంకా గాంధీని అవమానించేలా మాట్లాడిన బిజెపి అభ్యర్థి రమేశ్ బిధూరి చేసిన అసందర్భ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. దేశం కోసం గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసింది. ఒక్కసారి చరిత్రలోకి వెళ్లి చూడాలన్నారు. వారి గొప్పతనం ఏంటో మీకు తెలుస్తుంది. అలాంటి కుటుంబానికి చెందిన వ్యక్తుల గురించి సంస్కరహీనంగా మాట్లాడం ఎంత వరకు సమంజసమో బిజెపి నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. రికార్డు మెజారిటీతో ప్రజలు ఎన్నుకున్న ఓ మహిళా ఎంపిపై అభ్యంతకర వ్యాఖ్యలు చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. భారతీయ సమాజంలో మహిళలకు గొప్ప స్థానముందన్నారు.

# బిసి సంక్షేమాన్ని మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం


## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** బిసిల సంక్షేమానికి సంబంధించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ సర్కారు అదేవిధంగా ఆలోచిస్తోందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బిసిల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టుగా మారిదన్నారు. బిసిలకు సముచిత స్థానం కల్పించడంలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు సిద్ధరామయ్య సమక్షంలో కామారెడ్డిలో బిసి డిక్లరేషన్‌ను విడుదల చేసిందని, ప్రతి యేటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్షకోట్ల నిధులు కేటాయిస్తామన్నారు. గడిచిన రెండు బడ్జెట్లలో బిసిల ఊసేలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతం పెంచి, వెంటనే ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 23,973 మంది బిసిలకు అధికారం కల్పిస్తామని గొప్పగా చెప్పారు. రిజర్వేషన్ల పెంపు అతీగతి లేకుండా పోయిందన్నారు. బిసిలకు అన్ని రకాలుగా న్యాయం చేసింది భారతీయ జనతా పార్టీ మాత్రమే అన్నారు.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం ఓటర్ల తుది జాబితా విడుదల

**న్యూఢిల్లీ, జనవరి 6:** ఢిల్లీ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల దృష్ట్యా రాష్ట్రఎన్నికల ముఖ్యనిర్వహణ అదికారి ఢిల్లీలోమొత్తం ఓటర్ల తుదిజాబితాను సోమవారం విడుదలచేసారు. దేశరాజధానిలో మొత్తం 1,55,24,858 మంది ఓటర్లు ఉన్నారు. 2024 అక్టోబరు 29వ తేదీ తర్వాతనుంచే 1.09శాతంమంది ఓటర్లుపెరిగినట్లు తేలింది. మొత్తం ఓటర్లలో పురుషులు 83,49,645 మంది మహిలలు 71,73,952 మంది కాగా 1261 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు సిఇఒ తెలిపారు. ఓటర్ల ముసాయిదా జాబితాలో 3,08,942 మంది ఉన్నారు. మొత్తం తొలగింపులు 1,41,613గా ఉన్నట్లు ఢిల్లీ సిఇఒ తెలిపారు. దీనితో ఒక లక్షల 67,329 మంది ఓటర్లుపెరిగారు. లింగతారతమ్యాలు కూడా 04 పాయింట్లు తగ్గాయి. ఓటర్ల జనాభా నిష్పత్తి కూడా రెండు పాయింట్లుపెరిగింది. మొత్తం 52,554 మంది మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకునేవారు నమోదయ్యారు. ఓటర్లముసాయిదా తర్వాత ప్రకటించిన ప్రత్యేక సమ్మరీరివిజన్‌కింద 18-19 ఏళ్లవయసు వారంతా ఓటర్లుగా నమోదయ్యారు.అలాగే తప్పుడు పత్రాలు సమర్పించి ఓటరుగా నమోదయ్యేందుకు ప్రయత్నించారన్న ఫిర్యాదులపై ఎనిమిది ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చర్యలుంటాయని సిఇఒ హెచ్చరించారు. మొత్తం ఢిల్లీఓటర్లలో 12,977 మంది సర్వీసుఓటర్లు, 2,08,302 మంది 18నుంచి 19 ఏళ్లమధ్యలో ఉన్నవారునానరని 79,436 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. నగరంలో 2,77,221 మంది ఓటర్లు ఉంటే వారంతా 80 ఏళ్లకుపైబడినవారేనని తేలింది. 70 నుంచి 79 ఏళ్లమధ్యలో ఉన్నవారు 7,89,190 మందివరకూ ఉన్నారు. 60 నుంచి 69 ఏళ్లవయసు మధ్యలో ఉన్నవారు 13,77,909 మందివరకూ ఉన్నట్లు తేలింది. వికాస్‌పురి సీటులో అత్యధికంగా ఓటర్లు నమోదయ్యారు. ఇక్కడ 4,62,184 మంది ఓటర్లు ఉన్నారు. ఇక ఢిల్లీ కంటోన్మెంట్ ప్రాంతంలో తక్కువమంది ఓటర్లుఉన్నారు. 78,893 మంది మాత్రమే ఇక్కడ ఉన్నారు. తిలక్‌నగర్ నియోజకవర్గంలో లింగనిష్పత్తి అధికంగా ఉంది. 967గా ఉంది. ఓఖ్లా నియోజకవర్గంలో అతితక్కువ అంటే 731 లింగనిష్పత్తి ఉంది. ఈసారి జరిగే ఎన్నికలు ఢిల్లీలో ముక్కోణపు పోటీతో ఉంటాయని అంచనా. ఆమ్ ఆద్మీపార్టీ, భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్ మిత్రపక్షాలు కూటమిగా ఏర్పడి పోటీలోకి దిగుతున్నాయి. గడచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అరవింద్‌కేజ్రీవాల్ ఆధ్వర్యంలోని ఆమ్ ఆద్మీపార్టీ వెల్లువలాంటి విజయం అందుకుంది. 70 స్థానాల్లో 67 స్థానాలు 2015లో గెలిస్తే 2020లో 62 స్థానాలు గెలిచింది. బిజెపి 2015లో కేవలం మూడుసీట్లుమాత్రమే గెలిస్తే 2020లో కొంతమెరుగుపడింది. కాంగ్రెస్ పార్టీ ఒక్కస్థానంలోకూడా గెలవలేకపోయింది.

# జూపార్కు ఫ్లైఓవర్‌కు మన్మోహన్ పేరు



>> విస్తరణకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సహకరించాలని, మూసీనది పునరుజ్జీవన ప్రాజెక్టు కేంద్రం ఆర్థిక సహాయం చేయాలని ఆయన తెలియజేశారు. గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి వారం రోజులలో శంకుస్థాన చేస్తామని, పాతబస్తీలో ప్రభుత్వం జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నామని, పాతబస్తీ మీరాలం చెరువులో కేబుల్ వంతెనను ఏర్పాటు చేస్తామని, ఈ నెల 11,12 తేదీలలో పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాల విషయమై ఎంఐఎం శాసన సభ్యులు, అధికారులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాతబస్తీ అభివృద్ధి కోసం కావలసిన నిధులను మంజూరు చేస్తామని, జూ పార్కు నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు నిర్మించిన ఫ్లైఓవర్‌కు మాజీ ప్రధానమంత్రి దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ నామకరణం చేయనున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాటు మాట్లాడుతూ పాతనగర అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని, పాతబస్తీలో ఐటి టవర్ ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పనకు పాటు పడతామని తెలిపారు. హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ జైలుకు ఎవరూ వెళ్ల కూడదని, రాజకీయాలలో జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తున్నదని, జైలుకు ఎవరు వెళ్తారో ఎవరు వెళ్లరో తనకు తెలియదని అన్నారు.. పాతనగరంలోని మెట్రో బాధితులకు చెక్కులు అందజేశామని, మీరాలం మండి, చార్మినార్ వద్ద మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరటం జరిగిందని ఆయన తెలియజేశారు.

ఈ నెల 26 నుంచి పేద ప్రజలకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నందుకు ఎంపి అసదుద్దీన్ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

రాష్ట్రంలోని రైతులకు ముఖ్యమంత్రి మంచి సేవలు అందిస్తున్నారని ఎంపి అసదుద్దీన్ ఓవైసీ కొనియాడారు. ఎంఐఎం శాసన పక్ష నాయకులు, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం శాసన సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ చార్మినార్ ఫెడస్ట్రనైజేషన్ జోన్ పనులు పూర్తి చేయాలని, లాల్‌దర్వాలోని శ్రీ సింహవాహినీ మహంకాళీ మందిరంకు నిధులు మంజూరు అయినప్పటికి ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదని, వెంటనే పనులు ప్రారంభించాలని, పాతబస్తీ క్రీడాకారుల కోసం మైదానం నిర్మించాలని, త్రాగు నీటి సమస్య పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సమావేశంలో నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, చార్మినార్ నియోజకవర్గం ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీ రెహ్మత్ బేగ్, కాంగ్రెస్ నాయకులు రజా అలీ మీర్జా, అస్గర్ అలీతో పాటు ఎంఐఎం కార్పొరేటర్లు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. కాగా ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చినబహదూర్‌పుర, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీలను లోపలకు అనుమంతిచక పోటవంతో రహదారి మీదనే ఉండి పోయారు. చేసేది లేక కాంగ్రెస్ నాయకులు తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. పాతబస్తీలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రాష్ట్రంలో 22,448 వేల మెగావాట్ల విద్యుత్తు పెంపు

## 20,000 మెగావాట్ల గ్రీన్‌ఎనర్జీకి ప్రణాళిక

## 1.14 లక్షల కొత్త ఉద్యోగాల సృష్టి

## పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం భారీగా పెంపు

## తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** తెలంగాణలో భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్తు అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర సర్కార్ కొత్త ఇంథన పాలసీని రూపొందిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా 2030 సంవత్సరం నాటికి 22,448 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగిన ప్లాంట్లను నిర్మించనుంది. ఈ మేరకు ఇంథన పాలసీలో వీటిని పొందుపరచింది. ఇందులో భాగంగా ఒడిశాలోని థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది.

మరోపక్క రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025ని ఇప్పటికే మంత్రివర్గం ఆమోదించింది. దీని ప్రకారం 2030 నాటికి 20 వేల మెగావాట్ల అదనపు పునరుత్పాదక విద్యుత్తు సామర్థ్యాన్ని పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. అంతే కాకుండా తద్వారా పదేళ్లలో రాష్ట్రంలో ఏకంగా 1.14 లక్షల కొత్త ఉద్యోగాలు ఈ రంగంలో సృష్టించనుంది. కాలుష్య కారక తీవ్రతను 33 తగ్గించడమే ఈ విధానం లక్ష్యంగా ఉంది. ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలతో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపుదల చేయాలని నిర్ణయించింది.

ప్రధానంగా ప్రభుత్వం చేపడుతున్న మెట్రో విస్తరణ, ఫార్మాసిటీ, ఏఐ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు వంటి పెద్ద ప్రాజెక్టులతో విద్యుత్తు డిమాండ్ గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. ఇప్పటికే 2024-25లో గరిష్ట డిమాండ్ 15623 మెగావాట్లుగా ఉండగా, 2034-35 నాటికి అది 31,809 మెగావాట్లకు చేరనుంది. ఈ విద్యుత్ పాలసీ ముఖ్య ఉద్దేశాలను పరిశీలిస్తే వివిధ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు అందించడం. ఫ్లోటింగ్ సోలార్, విండ్ పవర్, గ్రీన్ హైడ్రోజన్, హైబ్రిడ్ ప్రాజెక్టులకు భారీగా సబ్సిడీలు, పన్ను మినహాయింపులు ఇవ్వనుంది. అలాగే సౌర విద్యుత్తు, పవన విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలు అందుబాటులోకి తీసుకురానుంది. అంతేకాకుండా రూలింగ్ లీనియన్స్ అంటే భూ వినియోగ మార్పులకు అనుమతి అవసరం లేదనేది నూతన పాలసీలో స్పష్టం చేసింది. విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు గాను అవసరమైన భూముల కొనుగోలుపై 100 స్టాంప్ డ్యూటీ రీయింబర్స్ అందించడం జరుగుతుంది. ప్రత్యేకంగా మహిళలకు ప్రోత్సాహకం అందించనుంది. ఇందులో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు 500 కిలోవాట్ నుండి 2 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించాలని నూతన పాలసీలో స్పష్టంగా పేర్కొంది. మరోపక్క రూఫ్ టాప్ ప్రాజెక్టులను ప్రైవేటుగా మంజూరు చేయనుంది. దీంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ గృహాలు, పంచాయతీ భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం కలిగించనున్నట్లు వెల్లడించింది. పెట్టుబడులకు వేగవంతమైన అనుమతులు అందించడం. ఇందుకోసం టీజీఐపాస్ ద్వారా అన్ని రకాల అనుమతులు వేగంగా జారీ చేయడం జరుగుతుంది. వీటికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్వోసీ అవసరం లేకుండా చర్యలు చేపట్టింది. ఫ్యూచర్ ఫోకస్ తెలంగాణలో గల అనుకూల వాతావరణ పరిస్థితులు సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తికి పెద్దగా సహకరిస్తాయి.

300 రోజులు సౌర విద్యుత్తు అందుబాటులో ఉండే రాష్ట్రం, గాలులు బలంగా వీచే 8 రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ పాలసీ ద్వారా తెలంగాణ గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో దేశవ్యాప్తంగా కీలక ప్రదేశంగా మారనుంది. సమన్వయ అభివృద్ధి లక్ష్యంతో పాటు పర్యావరణ రక్షణకు దోహదపడే ఈ విధానం రాష్ట్రాన్ని ఒక నూతన శక్తి కేంద్రంగా మార్చనుందని ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ పాలసీలో పేర్కొంది.

